క్లుప్తంగా

ఎన్నికల నియమావళిపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ పెద్దన్నకుమార్

చుంచుపల్లి: కమ్యూనిటి పోలీసింగ్‌లో భాగంగా జిల్లా ఎస్పీ జి.వినీత్ ఆదేశాల మేరకు కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ పర్యవేక్షణలో బుధవారం చుంచుపల్లి మండలం చుంచుపల్లి తండాలో ఎన్నికల నియమావళిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చుంచుపల్లి సీఐ పెద్దన్న కుమార్ మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలు చేయవద్దని యువతకు, ప్రజలకు సూచించారు. అదేవిధంగా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ప్రతీఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో చుంచుపల్లి ఎస్సై జి.ప్రవీణ్ కుమార్, పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు



యాగశాలలో పూజలు చేస్తున్న దృశ్యం

టేకులపల్లి: టేకులపల్లి మండల కేంద్రంలోని శ్రీకోదండ రామాలయంలో దాతలు ఆంధ్రప్రదేశ్ నంద్యాల ఎస్పీ కుడితి రఘువీరారెడ్డి, కల్యాణి దంపతుల వితరణతో రామానుజ చార్యుల పంచలోహ విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన యాగశాలలో శ్రీరంగం అజయ్ సాయి చక్రి బృందం చేత హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం 11.53 గంటలకు రామానుజ చార్యుల విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని, ఆ తరువాత మహా అన్నదానం ఏర్పాటు చేయడం జరిగిందని, భక్తులు .అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో దాత కుడితి కల్యాణి, సర్పంచ్‌లు బోడ నిరోషా, బోడ సరిత తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన గురుకుల విద్యార్థులు



మెడల్ అందుకుంటున్న సల్మాన్

ఇల్లెందు: వరంగల్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి క్రీడాపోటీలలో ఇల్లెందు మైనార్టీ గురుకుల కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. బుధవారం వరంగల్‌లో జరిగిన క్రీడా పోటీలలో డిస్కస్ త్రోలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి ఎస్కే సల్మాన్ సిల్వర్ మెడల్ సాధించాడు. సల్మాన్‌ను రాష్ట్ర స్పోర్ట్స్ ఆఫీసర్ సోమేష్, ఆర్ఎల్‌సీ అరుణకుమార్, విజిలెన్స్ ఆఫీసర్ సీతారాములు, జమీల్, ప్రిన్సిపాల్ ముదాసిర్ హుస్సేన్, పీడీ నజీముద్దీన్, ఉపాధ్యాయులు అభినందించారు.

రేవంత్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

టేకులపల్లి: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు టేకులపల్లి మండలంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూక్యా దేవా నాయక్, వైస్ ఎంపీపీ ఉండేటి ప్రసాద్, ఇస్లావత్ రెడ్యా నాయక్, పూనెం సురేందర్, బోడ మంగీలాల్, ఈది గణేష్, గడ్డం మధు రెడ్డి, గుండా నరసింహారావు, బోడ ప్రసాద్, అర్జున్‌రావు, మురళీ, సంజయ్, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా బుధవారం కాంగ్రెస్ నాయకులు రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేసి, నూతన వస్త్రాలు అందజేశారు. కంచర్ల శ్రీనివాస్, డానియేల్, లింగంపల్లి శ్రీనివాస్, మహబూబ్, ఇమామ్, సుదర్శన్‌కోరీ, వచ్చా వెంకటేశ్వర్లు, సోనూ పాల్గొన్నారు.

బారికేడ్లతో బెంబేలు..

- ఎన్నికల కోడ్‌తో పోలింగ్ బూత్ సమీపాన నిబంధనలు..
- పోలీసుల బందోబస్తుతో 200 మీటర్ల మేర రోడ్డు బ్లాక్
- స్థానికులు, వాహనదారులకు ఇబ్బందులు



బస్టాండ్ సెంటర్‌లో 200 మీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన బారికేడ్ల మధ్య నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు

కొత్తగూడెంటౌన్: అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత నామినేషన్ల ప్రక్రియ మొదలు కావడంతో కొత్తగూడెంలోని ఆర్డీఓ కార్యాలయం నుంచి 100 మీటర్ల దూరంలో ఐదుగురు వ్యక్తులు మినహా అనుమతించడం లేదు. నామినేషన్ వేసే వ్యక్తితో పాటు మరో నలుగురు మాత్రమే ఆర్డీఓ కార్యాలయంలోకి వెళ్లాల్సి ఉంటుంది. మిగతా వారిని 100 మీటర్ల దూరంలోనే పోలీసులు తనిఖీలు చేపట్టి అడ్డుకుంటున్నారు. ఇది నామినేషన్లు ప్రారంభమైన 3వ తేదీ నుంచి అమలు చేస్తున్నారు. కానీ ప్రస్తుతం కొత్తగూడెం బస్టాండ్ సమీపంలో మరో 100 మీటర్ల దూరంలో బారికేడ్లను ఏర్పాటు చేసి పోలీసులు ఎవరినీ అనుమతించడం లేదు. దీంతో సామాన్య ప్రజలు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సింగరేణి ట్రాన్సిస్ట్ గెస్ట్ హౌజ్ కూడా అక్కడే ఉండటంతో రాజకీయ నాయకులు, అధికారులు, కార్మికులు అక్కడి వస్తుంటారు. అక్కడికి కూడా వెళ్లకుండా బారికేడ్లను ఏర్పాటు చేసి అడ్డుకుంటున్నారని, భోజనాలకు తమ ఇంటికి వెళ్తామన్నా అనుమతి ఇవ్వకుండా వాహనదారులను నిలిపివేయడంతో ప్రజలతో వాగ్వాదం జరుగుతోంది. కొత్తగూడెం రైటర్‌బస్తీలో సింగరేణి ఉద్యోగులతో పాటు ఇతర ఉద్యోగుల కుటుంబాలు చాలా వరకు నివాసం ఉంటున్నాయి. రైటర్‌బస్తీ నుంచి బస్టాండ్ సెంటర్‌కు రావాలన్నా, బస్టాండ్ సెంటర్ నుంచి రైటర్ బస్తీలోని నివాసాలకు వెళ్లాలన్నా ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బారికేడ్లను ఏర్పాటు చేసి వారిని అక్కడే అంటే 200 మీటర్ల దూరంలో అడ్డుకుని వెనకకు తిరిగి పంపిస్తున్నారు. అందరూ మధ్యాహ్నం కావడంతో భోజనాలకు, సొంత పనుల నిమిత్తం వెళ్లకుండా అడ్డుకుంటున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కొత్తగూడెం బస్టాండ్‌కు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు తిరిగి వెళ్లాలంటే ఇదే మార్గంలో రావాల్సి ఉంటుంది. దీంతో బస్సులను బారికేడ్ల మధ్య నుంచి అనుమతించడంతో బస్సు డ్రైవర్లు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్నపుడు అధిక సంఖ్యలో ప్రజలు తరలివస్తే కంట్రోల్ చేస్తే బాగుంటుంది. కానీ పోలీసులు మరో 100 మీటర్ల దూరంలో బారికేడ్లను ఏర్పాటు చేయడం ఎందుకని ప్రజలను, ప్రయాణికులను, వాహనదారులను ఇబ్బందులు పెట్టడమేనని తక్షణం బారికేడ్లను తొలగించి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



కొత్తగూడెం బస్టాండ్ వద్ద బారికేడ్లు



ఆర్డీఓ కార్యాలయం వద్ద 100 మీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు

ఓటు హక్కు వినియోగించుకోండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ బాలరాజు

ఇల్లెందురూరల్: ఓటు హక్కును ప్రతీఒక్కరూ విధిగా వినియోగించుకోవాలని ఎంపీడీఓ బాలరాజు సూచించారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటింగ్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా మన దేశం వర్ధిల్లడానికి ఎన్నికల ప్రక్రియే ప్రధాన కారణమన్నారు. తన ఓటు మంచి నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఓటరు చేతుల్లోనే ఉందని, ఈ విషయంలో ప్రతీఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు. అనంతరం ఓటరు అక్షరాస్యతను ప్రోత్సహించేలా కళాజాతా బృందం పాటల ద్వారా అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ, వైస్ ప్రిన్సిపాల్ బిందుశ్రీ, అకాడమిక్ కోఆర్డినేటర్ శేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాజు, అధ్యాపకులు కిరణ్, చెంచు రత్నయ్య, సరిత, సురేందర్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల చైతన్యంపై కళాజాతా



మాట్లాడుతున్న డీపీఆర్ఓ శ్రీనివాస్

కొత్తగూడెంఅర్బన్: ఓటర్లను చైతన్య పరిచేందుకు కళాజాతా బృందాలతో అవగాహన కల్పిస్తున్నట్లు డీపీఆర్ఓ శీలం శ్రీనివాస్ అన్నారు. బుధవారం కొత్తగూడెం తహసీల్దారు కార్యాలయ పరిసరాలు, సింగరేణి హెడ్డాఫీసు, మున్సిపల్ కార్యాలయ పరిధి తదితర ప్రాంతాలలో ఓటరు చైతన్య అవగాహన కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఆర్ఓ మాట్లాడుతూ.. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆదేశాల మేరకు ఓటరు చైతన్య కళాజాతా నిర్వహించినట్లు చెప్పారు. 2018లో జిల్లాలో 166 పోలింగ్ కేంద్రాలలో తక్కువ శాతం పోలింగ్ నమోదు అయినందున ఆయా ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రతీఒక్కరు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. నూటికి నూరు శాతం ఓటింగ్ జరిగే విధంగా ప్రతీఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకోవాలని చెప్పారు. ఓటు హక్కు వినియోగంలో రాష్ట్రస్థాయిలో మన జిల్లాను ఆదర్శంగా నిలపాలన్నారు. పండుగ వాతావరణంలో ఓటింగ్ వినియోగంచుకోవాలని, ఈ నెల 30న జరగనున్న పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బృందం సభ్యులు కొంపెల్లి బాలకృష్ణ, అలవాల కృపానందం, మిట్టపల్లి నరేందర్, ముత్తవరం ధనలక్ష్మి, గుగులోత్ నీల, షేక్ కౌసర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ.. త్వరలో కాంగ్రెస్‌లోకి?

ఇల్లెందురూరల్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బానోత్ హరిప్రియకు అవకాశం ఇవ్వొద్దంటూ మూడు నెలలుగా నియోజకవర్గ వ్యాప్తంగా ఆ పార్టీ నాయకులు అసమ్మతి రాగం వినిపిస్తూ వచ్చారు. ఒక దశలో నేరుగా పార్టీ అధిష్టానాన్ని కలిసి తమ అభిప్రాయం తెలియజేశారు. అసమ్మతి ఆరోపణలను పక్కన పెట్టిన పార్టీ అధినాయత్వం బీఆర్ఎస్ ఇల్లెందు అభ్యర్థిగా హరిప్రియనే ప్రకటించింది. ఈ మధ్యలో పార్టీ పెద్దలు, మంత్రులు, నియోజవకర్గ ఇన్‌చార్జ్ వద్దిరాజు రవిచంద్ర మధ్యవర్తిత్వం వహించి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అసమ్మతి సమసిపోయిందనుకొని అందరూ భావించారు. కానీ ఇల్లెందులో సీఎం కేసీఆర్ బహిరంగ సభకు ముందే బయ్యారం మండలంలో రాజీనామాలు వెల్లువెత్తాయి. సభ అనంతరం రాజీనామాల పర్వం ఊపందుకుంది. బుధవారం గార్ల మండలంలో జరిగిన రాజీనామాలకు కొనసాగింపుగా ఇల్లెందు మండలంలోనూ అసమ్మతి నాయకులు రాజీనామా చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే అసమ్మతి జెండా ఎగురవేసిన కొమరారం ఉమ్మడి గ్రామపంచాయతీకి చెందిన తెలంగాణ ఉద్యమ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు మంగళవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు మండలంలో అసమ్మతి శిబిరానికి నేతృత్వం వహిస్తున్న ఎంపీపీ చీమల నాగరత్నమ్మతో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు గురువారం పార్టీకి రాజీనామా చేయనున్నట్లు సమాచారం . ఇప్పటికే పలువురు ప్రజాప్రతినిధులు పార్టీని వీడగా తాజాగా మిగిలిన వారిలో అత్యధికులు పార్టీ వీడే యోచనలో ఉండటం మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఇదే విషయమై ఎంపీపీ చీమల నాగరత్నమ్మను సంప్రదించగా తమ నిర్ణయాన్ని గురువారం ప్రకటిస్తామని తెలిపారు.

పార్క్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయండి



జీఎంకు వినతిప్రతం అందజేస్తున్న శ్రీనివాస్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా రామవరంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ ఏరియా జనరల్ మేనేజర్ శాలెంరాజును కోరారు. బుధవారం జీఎం కార్యాలయంలో జీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... కార్మికుల నివాస ప్రాంతం మధ్యలో ఉన్న ఈ పార్క్‌లో ఎక్కువగా వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు, రిటైర్డ్ కార్మిక కుటుంబ సభ్యులు, పర్మనెంట్ కార్మికులు, యువకులు ఉదయం సాయంత్రం వాకింగ్, యోగా చేస్తుంటారని తెలిపారు. ఇక్కడ సరైన సౌకర్యాలు లేవని తెలిసి ఈ ప్రాంతాలను అభివృద్ధి చేయాల్సిన సింగరేణి వీటిని వదిలేసి, సీఎస్ఆర్ నిధులతో సుదూర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టడం శోచనీయమన్నారు. సానుకూలంగా స్పందించిన జీఎం వీలైనంత త్వరలో మీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

హామీ ఇస్తేనే మద్దతిస్తాం..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులు, రాష్ట్ర అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎవరైతే భరోసా ఇస్తారో.. వారికే హెచ్ఎంఎస్ మద్దతునిస్తుందని, రాష్ట్ర హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారి డిమాండ్లను వివరించారు.

- సంవత్సరానికి ఐదు కొత్తబావులు, పరుగు పందెం ద్వారా సింగరేణిలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పించాలి.
- సింగరేణిలో పనిచేసే ప్రతీ కార్మికుడికి సొంతింటి పథకం అమలు చేయాలి.
- సింగరేణి కార్మికుల సదుపాయాలపై ఇన్‌కమ్ ట్యాక్స్ కోలిండియా మాదిరిగా రీయింబర్స్‌మెంట్ అందజేయాలి.
- సింగరేణి పర్మనెంట్ కార్మికులు పనిచేసే స్థలాల్లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలి
- తెలంగాణలో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులకు జీతాల కోసం గెజిట్ విడుదల చేయాలి. కనీస వేతనం రూ.30 వేలు చెల్లించాలి.

నేడు న్యాయ చైతన్య సదస్సు

పాల్వంచ: నవంబర్ 9 న్యాయ సేవ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయ చైతన్య సదస్సును లయన్స్ క్లబ్ ఆఫ్ కిన్నెరసాని, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు క్లబ్ నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా కొత్తగూడెం జిల్లా జడ్జి డీఎల్ఎస్ఏ వసంత పాటిల్, లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ, ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి భానుమతి, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ శివప్రసాద్ హాజరు కానున్నారు.

ఐదో రోజు మూడు నామినేషన్లు దాఖలు





నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు మోహన్‌జీ, వెంకట ప్రవీణ్ నాయక్

ఇల్లెందు: ఐదో రోజు బుధవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇండిపెండెంట్ అభ్యర్థిగా డాక్టర్ గుమ్మడి అనురాధ (గుమ్మడి నర్సయ్య కుమార్తె) నామినేషన్ దాఖలు చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ నాయకులు కామేపల్లి జెడ్పీటీసీ వెంకట ప్రవీణ్ నాయక్, బయ్యారం మండలం జగత్‌రావుపేట ఎంపీటీసీ బానోతు మోహన్‌జీ నామినేషన్ దాఖలు చేశారు. ఈ నెల 3వ తేదీ నుంచి నేటి వరకు 13 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇక నామినేషన్ల పర్వం ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ప్రధాన పార్టీలతో పాటు చిన్న చిన్న పార్టీలు ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అయితే అంతా బీ ఫాంతో దాఖలు చేసేందుకు గురువారంను ఎంచుకున్నారు. కొంతమంది నాలుగు సెట్లు, మరికొంత మంది రెండు, మూడు సెట్లు వేయాలని, సెంటిమెంట్ ప్రకారం నిర్ణయించుకున్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

చుంచుపల్లి: కార్తీక మాసం సందర్భంగా కొత్తగూడెం డిపో నుంచి పంచారామాలకు, అన్నవరంలకు స్పెషల్ బస్సులు నడపనున్నట్లు కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులు ఈ నెల 19, 26 తేదీలతో పాటు డిసెంబర్‌లో 3, 10 తేదీల్లో పంచారామం, అన్నవరాలకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ బస్సుల్లో చార్జీలు పంచారామాలకు (అమరావతి, భీమవరం , పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట)లకు సూపర్ లగ్జరీ బస్సుకు కొత్తగూడెం నుంచి రూ.1,700, పాల్వంచ నుంచి రూ.1,750, అన్నవరానికి పాల్వంచ నుంచి ఎక్స్‌ప్రెస్‌కు రూ. 390, కొత్తగూడెం నుంచి రూ.370, డీలక్స్‌కు పాల్వంచ నుంచి రూ.490, కొత్తగూడెం నుంచి రూ.470 ఉంటాయని తెలిపారు.

40 మంది ఉంటే వారికి ప్రత్యేక బస్సు కేటాయించబడుతుందని ఈ అవకాశాన్ని కొత్తగూడెం, పాల్వంచ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఉద్యోగులు, వ్యాపారస్తులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఇందుకోసం ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉందని తెలిపారు. వివరాలకు 9959225959, 9959225981, 08744 – 293067 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఇల్లెందులో బీఆర్ఎస్‌దే విజయం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఇల్లెందురూరల్: ఐదేళ్లపాటు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించిన ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ఎన్నికల్లో విజయం సాధించడం ఖాయమని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఖమ్మంపాటి రేణుక, వైస్‌ఎంపీపీ దాస్యం ప్రమోద్‌కుమార్ అన్నారు. బీఆర్ఎస్ మండల శాఖ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కరోనా విపత్కర పరిస్థితులను ప్రజలు ధైర్యంగా ఎదుర్కొనేలా ప్రజలకు ఎమ్మెల్యే అండగా నిలిచారని గుర్తుచేశారు. ప్రతి గ్రామానికీ లింకు రోడ్లు, గ్రామాలలో అంతర్గత రహదారులు మెరుగుపర్చారని, ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు అందించారని వివరించారు. ప్రజల కోసం ఇంత అభివృద్ధి చేసిన హరిప్రియ మరోసారి ఎన్నికల్లో పోటీ చేసేందుకు గురువారం నామినేషన్ వేయబోతున్నారని, ఈ సందర్భంగా నిర్వహించే ప్రదర్శనకు పార్టీ కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో ఘాజీ, కమల, కుమార్, మల్సూర్, వల్లాల మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

వారికి ఓట్లు అడిగే హక్కు లేదు..



ప్రచారం నిర్వహిస్తున్న కామేశ్

సుజాతనగర్: ప్రభుత్వం ప్రకటించిన దళిత బంధు, బీసీ బంధు వంటి ప్రభుత్వ పథకాలను కమీషన్ల పేరుతో దోచుకున్న నియోజకవర్గ నేతలు ఏ ముఖం పెట్టుకొని మళ్లీ ఓట్లు అడగడానికి ప్రజల ముందుకు వస్తున్నారని బీఎస్పీ కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి యెర్రా కామేష్ ప్రశ్నించారు. మన కొత్తగూడెం – మన కామేశ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని లక్ష్మీదేవిపల్లి, కోమటిపల్లి, నిమ్మలగూడెం గ్రామాల్లో బుధవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కామేశ్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ప్రజా ప్రతినిధుల ద్వారా దళిత బంధు పేరుతో రూ.లక్షల సొమ్ము దండుకున్నారని ఆరోపించారు. పేదలకు అందాల్సిన ప్రభుత్వ పథకాలలో కమీషన్లు దండుకున్న బీఆర్ఎస్ పార్టీ ఒకవైపు, బీఆర్ఎస్‌తో పొత్తుకు ఆశించి చివరి నిమిషంలో గెంటివేతకు గురైన సీపీఐ పార్టీలకు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. ప్రజలకు కావాల్సిన కనీస అవసరాలనే బీఎస్పీ మేనిఫెస్టోలో పెట్టిన విషయాన్ని ఓటర్లు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో తుంపురి రాజు, ఆంజనేయ శర్మ, అనిల్, భానుమతి, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

బుసరాయిలో వైద్య బృందం సందర్శన



కాలినడకన వెళ్తున్న సెంట్రల్ టీం సభ్యులు

పాల్వంచ: ఆదివాసీ గ్రామమైన బుసరాయిని ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రిసోర్స్ సెంట్రల్ టీం (ఢిల్లీ) బుధవారం సందర్శించారు. ఉల్వనూరు పంచాయతీ దట్టమైన అటవీ ప్రాంతంలో ఉండే ఈ గ్రామానికి సరైన రవాణా సౌకర్యం లేక పోవడంతో ట్రాక్టర్‌పై టీం చేరుకుంది. ఈ సందర్భంగా మలేరియా మాస్ స్క్రీనింగ్ పరీక్షలు, ఇతర వైద్య పరీక్షలు, పిల్లలకు టీకాలు వేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా ఆఫీసర్ డాక్టర్ స్పందన, అదనపు అధికారి గొంది వెంకటేశ్వర్లు, ఐఐఓ బాలాజీ నాయక్, ఆళ్లపల్లి మెడికల్ ఆఫీసర్ రేవంత్, ఉల్వనూరు మెడికల్ ఆఫసర్ తేజస్వీని, ఐకేఎంఆర్ ఢిల్లీ సభ్యులు పాండే, మణీశ్, నవీన్, హరికృష్ణ, మచ్చ లక్ష్మి, శేషరత్నం, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు ప్రారంభం..



జిన్నింగ్ మిల్లులో పత్తి నిల్వలు



ప్రైవేట్ వ్యాపారుల ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు

సుజాతనగర్: సుజాతనగర్ మండలంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది పదిరోజుల ముందే కొనుగోళ్లు ప్రారంభించారు. సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఇండియా) ఆధ్వర్యంలో స్థానిక జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఇటీవల ప్రారంభించారు. గడిచిన మూడు రోజుల్లో అక్కడ సుమారు 500 క్వింటాళ్ల పత్తిని రైతుల నుంచి కొనుగోలు చేశారు. గతేడాదితో పోల్చుకుంటే మండలంలో ఈ ఏడాది సుమారు 1000 ఎకరాల విస్తీర్ణంలో అధికంగా పత్తి పంటను సాగుచేశారు. గత ఏడాది 9,326 ఎకరాల్లో సాగు చేయగా... ఈ ఏడాది 10,785 ఎకరాల్లో సాగయింది. ఈసారి ముందే పంట చేతికి వస్తుండడంతో పది రోజుల ముందే పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్‌తో పాటు వివిధ మండలాల్లో కొనుగోళ్లు ప్రారంభించారు.


అంచనాలకు మించి దిగుబడి..

మండల వ్యాప్తంగా 10,785 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేయగా ఒక లక్షా 10 వేల క్వింటాళ్ల మేర దిగుబడి వస్తుందని అధికారులు, వ్యాపారులు అంచనా వేస్తున్నారు. తేమ 8 శాతం ఉంటే రూ.7,020, 9 శాతం ఉంటే రూ.6,979, 10 శాతం ఉంటే రూ.6,879, 11 శాతం ఉంటే రూ.6,809, 12 శాతం ఉంటే రూ.6,739 చొప్పున కొనుగోలు చేయనున్నారు.

తక్కువ ధరకే కొనుగోళ్లు...

పత్తి కొనుగోళ్లను ప్రభుత్వం ప్రారంభించిన నాటి నుంచే దళారులు రంగప్రవేశం చేశారు. అమాయక రైతులకు ధరను ఆశ చూపి తక్కువ ధరకు కొనుగోళ్లు జరుపుతున్నారు. మండలంలో ప్రధాన రహదారి పక్కన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోళ్లు చేస్తున్నారు. అటు రైతులు కూడా తమ అవసరాలు తీరతాయని దళారులకే అమ్ముతున్నారు. అదేవిధంగా పెట్టుబడికి తెచ్చిన అప్పుకు వడ్డీలు పెరుగుతుండటంతో స్థానికంగా ఉన్న ప్రైవేట్ వ్యాపారులకు పత్తిని అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే ప్రైవేటు వ్యాపారులు తక్కువగా కొనుగోలు చేస్తున్నారు. గ్రామాల నుంచి సీసీఐ కేంద్రాలకు పత్తిని తరలించాలంటే రవాణా ఖర్చులు కూడా రైతుకు అదనంగా అవుతున్నాయి. సీసీఐ కేంద్రాల్లో అమలయ్యే తేమ, ఇతర కారణాలతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకే అమ్మేందుకు మొగ్గు చూపుతున్నారు. ఒకవేళ సీసీఐ కేంద్రంలో అమ్మినా నగదు చెల్లింపుల్లో జాప్యం ఉండటంతో... అప్పటికప్పుడు నగదు ఇస్తున్న ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

క్వింటాకు రూ.10వేలు చెల్లించాలి...



పెరిగిన ఖర్చుల దృష్ట్యా ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధరతో రైతులకు లాభం వచ్చే అవకాశం లేదు. పెట్టుబడులకే సరిపోతుంది. ప్రభుత్వం మద్దతు ధరను పెంచితే రైతులకు మేలు జరుగుతుంది.

– గుగులోత్ వెంకన్న, బేతంపూడి

50 క్వింటాళ్ల పత్తి అమ్మిన..



పత్తి కొనుగోలు కేంద్రం సీసీఐ ప్రారంభించారని తెలుసుకొని ఇక్కడికి వచ్చాను. మొదటి సారి తీసిన 50 క్వింటాళ్ల పత్తిని తెచ్చి విక్రయించాను. పంటకు తెగులు సోకి పూత, కాత రాలిపోయింది. తక్కువ దిగుబడి వచ్చింది.

– భూక్యా బీంజా, టేకులపల్లి